కాంగ్రెస్‌కు మద్దతు హర్షణీయం

• ఉద్యమకారుల స్థితిగతులపై పార్టీకి అవగాహన ఉంది • మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి, కోడూరి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణ గౌడ్

విద్యానగర్: తెలంగాణ ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడం హర్షణీయమని మానకొండూర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణ గౌడ్ అన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో ఉద్యమకారులు అనేక ఇబ్బందులకు పడ్డారని, వారిని ఆదుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఉద్యమకారుల స్థితిగతులపై ఒక అవగాహన ఉందని, వారికి 250 గజాల భూమితోపాటు రూ.25 వేల పెన్షన్ ఇస్తామని గతంలోనే ప్రకటించిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ ఎక్కేటి సంజీవరెడ్డి, రాష్ట్ర కో–ఆర్డినేటర్ అయిల ప్రసన్న, భోగి పద్మ, కనకం విద్యాసాగర్, మామిడి మొగిలి, శంకర్, మల్లేశం, సదానందం, సంజీవ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీరు తీసుకునేది 'ట్యాపింగ్' పైసలే

• విచారణలో బయటపడితే గండమే • కాంగ్రెస్‌లో చేరేవారికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి హెచ్చరిక



మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి

కరీంనగర్‌టౌన్: ఫోన్ ట్యాపింగ్ ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు పంపుతున్న సొమ్ముతో కార్పొరేటర్లను, ప్రజాప్రతినిధులను, నాయకులను కొనాలని కాంగ్రెస్ నాయకులు చూస్తున్నరు.. ఆ డబ్బు తీసుకునేవాళ్లకు మేం చెప్పేదొక్కటే.. మీరు తీసుకునే సొమ్ము ఫోన్ ట్యాపింగ్ పైసలే.. విచారణలో బయటపడితే మీకు గండమే.. జైలుకు వెళ్లక తప్పదని మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెనవాడ సంగప్ప హెచ్చరించారు. కరీంనగర్‌కు చెందిన కొందరు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్లు చర్చ జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రధాని మోదీ నాయకత్వమే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ప్రధాని అభ్యర్థి ఎవరో చెప్పుకోలేని స్థితిలో కాంగ్రెస్ ఉందని ఎద్దేవా చేశారు. రిజర్వేషన్ల రద్దు అంటూ ఆ పార్టీ విష ప్రచారం చేస్తోందన్నారు. కాంగ్రెస్ హయాంలో మంచి నీళ్లు దొరకలేదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నిజమైన బీసీ అయితే మోదీ, సంజయ్ బీసీలేనని, నువ్వు బీసీ పక్షం ఉంటావో.. ఓసీ పక్షం ఉంటావో చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు కొలగాని శ్రీనివాస్, బొమ్మ జయశ్రీ,, బొంతల కల్యాణ్, కటకం లోకేశ్ పాల్గొన్నారు.

లెక్క దాటితే పదవికే గండం

• ఎంపీ అభ్యర్థి ఖర్చు రూ.95 లక్షలు
• గతంలో రూ.70 లక్షలే
• ఎలక్షన్ కమిషన్ నిఘా



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారంతో ముగిసింది. ఇప్పటికే ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, అధికారులు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అభ్యర్థుల రోజువారీ ఖర్చుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఒక్కొక్కరు రూ.95 లక్షలకు మించి ఖర్చు చేయరాదు. ఒకవేళ పరిమితి దాటితే ఎన్నికైనా సరే పదవి కోల్పోయే ప్రమాదముంది. గతంలో ఎన్నికల ఖర్చు రూ.70 లక్షలుండగా ప్రస్తుతం పెంచారు. ప్రచార సరళి, సభలు, సమావేశాలు, వాహనాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు.

నామినేషన్ నుంచే లెక్క షురూ..

అభ్యర్థులు నామినేషన్ వేసినప్పటి నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతీదానికి లెక్క చూపెట్టాల్సి ఉంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ ర్యాలీలతో నామినేషన్ వేయగా మిగతా పార్టీలవారు సాదాసీదాగా ఐదుగురితో కలిసి వేశారు. నామినేషన్ వేయడానికి ముందు అభ్యర్థులు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరిచి ఎన్నికల లావాదేవీలను నమోదు చేయాల్సి ఉంటుంది.

ప్రలోభాల నియంత్రణకు నిఘా

ఎన్నికల్లో డబ్బు, ఇతర ప్రలోభాలను నియంత్రించేందుకు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక స్టాటిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్, వీడియో వీవింగ్, ఎంసీసీ బృందాల ఆధ్వర్యంలో నిఘా పెట్టారు. అభ్యర్థులకు సంబంధించిన ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలను నిశితంగా పరిశీలిస్తున్నాయి. సభల్లో ఏర్పాటు చేసిన టెంట్లు, కుర్చీలు, వాహనాలు ఇతర సామగ్రితోపాటు ప్రచార కార్యక్రమాలను వీడియో తీస్తున్నారు.

వ్యయ పరిశీలకులు..

ఎన్నికల్లో ధన ప్రవాహం కట్టడికి ఎన్నికల సంఘం ఐఏఎస్, ఐపీఎస్ క్యాడర్ అధికారులను వ్యయ పరిశీలకులుగా నియమించింది. కరీంనగర్‌కు అశ్వినీకుమార్ పాండేను నియమితులయ్యారు. అభ్యర్థుల ఖర్చును వ్యయ బృందాలు మూడుసార్లు తనిఖీ చేస్తాయి. నామినేషన్ మొదలుకొని చివరివరకు, ఉపసంహరణ తర్వాత ఓట్ల లెక్కింపు వరకు నియోజకవర్గం పరిధిలోనే ఉంటారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన 27 రోజులకు మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. అభ్యర్థుల వ్యయాలను ఖర్చులను పరిశీలించి, వ్యత్యాసం ఉంటే ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తారు. ఎన్నికల ఫలితాలు వెల్లడైన 30 రోజుల్లోపు అభ్యర్థులు ఖర్చు వివరాలను బిల్లులతో సహా అధికారులకు సమర్పించాలి. పరిమితికి మించి ఖర్చు చేసినా, వ్యయానికి సంబంధించిన లెక్కలను నిర్దేశించిన సమయంలో చూపకున్నా అనర్హత వేటు పడుతుంది. తర్వాత ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోల్పోతారు. గెలిచినా, ఓడినా ఖర్చు వివరాలను సమర్పించాల్సి ఉంటుంది.

ఈసీ నిర్ణయించిన ధరలు రోజువారీగా..

టెంట్‌కు రూ.2,500, జనరేటర్ రూ.7 వేలు, ఫంక్షన్‌హాల్ రూ.20 వేలు, ప్రచార రథం రూ.3 వేలు, పోస్టర్లు రూ.5 వేలు, హోర్డింగ్‌లు రూ.6 వేలు, డప్పులు ఒకరికి రూ.700, కళాబృందాలు ఒకరికి రూ.1000, ఎల్ఈడీ స్క్రీన్ రూ.5 వేలు, ఎయిర్ కూలర్ రూ.1,500, ఇన్నోవా రూ.3,500, ఆటో రూ.1,500, వ్యాన్ రూ.7 వేలు, టీ రూ.10, స్నాక్స్ రూ.15, సాదాభోజనం రూ.40, హోటల్ చార్జీలు రోజుకు రూ.2 వేలు, వీడియో నెలకు రూ.45 వేలు ఖర్చు చేయాలి.

క్లుప్తంగా

బీజేపీలో చేరిక



పార్టీలో చేరినవారితో ఎంపీ సంజయ్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్, ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు శుక్రవారం బీజేపీలో చేరారు. జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి గుర్రం ఆనందరెడ్డి, యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడు గాలి రవి యాదవ్, పలువురు మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, కుల సంఘాల అధ్యక్షులు, వార్డు మెంబర్లకు ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌లోని తన కార్యాలయంలో కండువాలు కప్పి, ఆహ్వానించారు.

నేటి 'ఎమర్జింగ్ భారత్'కు తరలిరండి



మాట్లాడుతున్న రాజభాస్కర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6 గంటలకు కరీంనగర్‌లో నిర్వహిస్తున్న ఎమర్జింగ్ భారత్ కార్యక్రమానికి మేధావులు తరలివచ్చి, విజయవంతం చేయాలని సంస్థ చైర్మన్ డాక్టర్ రాజభాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని ప్రజ్ఞాభారతి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లలో మన దేశం ప్రపంచానికి మార్గనిర్దేశం చేస్తూ విశ్వ గురువుగా ఎదిగిందని పేర్కొన్నారు. అభివృద్ధిలో దూసుకుపోతోందని, దీనికి కారణం బలమైన నాయకత్వమేనని తెలిపారు. ఎమర్జింగ్ భారత్ కార్యక్రమంలో సమగ్ర సమాచారం తెలియజేయడానికి ప్రముఖ కాలమిస్ట్, పొలిటికల్ అనలిస్టు, రచయిత శంతను గుప్త వస్తున్నారని అన్నారు. ప్రజ్ఞాభారతి ప్రధాన కార్యదర్శి మందల నగేశ్ రెడ్డి, జె.సత్యనారాయణ రెడ్డి, దేశిని శ్రీనివాస్, వెచ్చ మురళి, తుమ్మల రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఈడీ పరామర్శ



చికిత్స పొందుతున్న ఉద్యోగిని పరామర్శిస్తున్న ఈడీ వినోద్‌కుమార్

విద్యానగర్: ఆర్టీసీ గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌లో భాగంగా కాల్ హెల్త్ సంస్థచే తీవ్ర అనారోగ్యంతో ఉన్నట్లు గుర్తించిన, కరీంనగర్ ప్రతిమ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉద్యోగులను కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్ కుమార్, రీజినల్ మేనేజర్ ఎస్.సుచరిత శుక్రవారం పరామర్శించారు. ఆర్టీసీ అన్ని విధాలా ఆదుకుంటుందని బాధితుల కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. వైద్యులతో మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రస్తుతం ఆస్పత్రిలో కరీంనగర్–1 డిపోకు చెందిన హెల్పర్ శ్రీనివాస్‌కు బైపాస్ సర్జరీ కాగా, 2 డిపో డ్రైవర్ యూసుఫ్‌కు స్టంట్లు వేశారు. వీరితోపాటు మరో నలుగురు ఉద్యోగులు ఇన్‌పేషెంట్స్‌గా చికిత్స పొందుతుండగా అందరి ఆరోగ్యం మెరుగ్గా ఉందని డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సెక్రటరీ కె.యుగంధర్ రెడ్డి, కరీంనగర్–1 డిపో హెల్త్ వలంటీర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అతుల్ కుమార్ మృతి తీరని లోటు



నివాళి అర్పిస్తున్న వెంకట్‌రెడ్డి, సీపీఐ నాయకులు

కరీంనగర్: పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమించిన నేత సీపీఐ జాతీయ కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్ అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ఆయన మృతి సీపీఐకి తీరని లోటని పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో అతుల్ కుమార్ అంజన్ చిత్ర పటానికి కరీంనగర్, సిద్దిపేట జిల్లా కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్‌లతో కలిసి నివాళి అర్పించారు. ఉత్తరప్రదేశ్‌లో ఉన్నత కుటుంబంలో జన్మించిన ఆయన విద్యార్థి దశ నుంచే చురుగ్గా ఉండేవారన్నారు. బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువస్తే దేశవ్యాప్తంగా రైతు సంఘాలు, రైతులను ఏకతాటిపైకి తీసుకువచ్చి పోరాటం చేశారని తెలిపారు. సీపీఐ బలోపేతం కోసం కృషి చేశారన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీకేఎంయూ ఆధ్వర్యంలో..

అతుల్ కుమార్ అంజన్ మృతి రైతాంగ పోరాటలకు తీరని లోటని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ అన్నారు. బీకేఎంయూ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, నాయకులు ఎగుర్ల మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించడమే లక్ష్యం

• 6న సమావేశానికి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ రాక
• జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి



మాట్లాడుతున్న వెంకటస్వామి

కరీంనగర్: దేశంలో మతోన్మాద బీజేపీని ఓడించడమే లక్ష్యంగా సీపీఐ శ్రేణులు పని చేయాలని, హిందువులను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్న బండి సంజయ్‌ని కరీంనగర్‌లో ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెబుతున్నారని, ఇవి జరగొద్దంటే మూడోసారి బీజేపీ అధికారంలోకి రాకూడదన్నారు. అందుకే సీపీఐ ఇండియా కూటమిలో భాగమైందని తెలిపారు. ఎంపీగా సంజయ్ ఐదేళ్లలో చేసిందేమీ లేదని, కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఈ నెల 6న సీపీఐ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని అన్నారు. సీపీఐ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంద పవన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపెల్లి రాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి తదితరులున్నారు.

రిజర్వేషన్లు తొలగిస్తారన్నది అపోహ



మాట్లాడుతున్న రెడ్డి సంఘం నాయకులు

విద్యానగర్: ఈడబ్ల్యూఎస్ ద్వారా అగ్రవర్ణాల పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించిన బీజేపీనే గెలిపించాలని కరీంనగర్ రెడ్డి సంఘం నాయకులు కోరారు. శుక్రవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం ప్రతినిధులు రేకులపల్లి రవీందర్ రెడ్డి, కాసర్ల మధుకర్ రెడ్డి మాట్లాడారు. రిజర్వేషన్ల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాటలను వక్రీకరించారని తెలిపారు. రాజ్యాంగాన్ని సవరించి, రిజర్వేషన్లు తొలగిస్తారన్నది అపోహ మాత్రమేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజానీకానికి సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రావుల కిరణ్ రెడ్డి, కాల్వ పూర్ణచందర్ రెడ్డి, కూర మైపాల్ రెడ్డి, న్యాలకొండ ప్రసన్న కుమార్‌రెడ్డి, వర్ణ పెద్దిరెడ్డి, దారం జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర పెంచి, బోనస్ ఇవ్వాలి

కరీంనగర్: పంటలకు మద్దతు ధర పెంచి, బోనస్ ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో ఆయన రైతులను కలిసి మాట్లాడారు. ఏ–గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,203, బీ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,183 ఎటూ సరిపోవని, రూ.3,500 ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వరి పంటకు రూ.500 బోనస్, రైతు రుణమాఫీ, రైతు బీమా, సబ్సిడీ ఎరువులు వెంటనే అమలు చే యాలని డిమాండ్ చేశారు. మార్కెట్లో రైతుల కు తాగునీరు, బాత్‌రూం, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు తదితర సౌకర్యాలు వెంటనే కల్పించాలని కోరారు. వారికి నష్టం చేసే మిల్లర్లు, దళారులపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తేమ, మట్టి, తాలు లెక్కలోకి తీసుకోకుండా ధాన్యం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రత్నం రమేశ్, బాబు, సంతోష్, దుర్గన్న, రాజేందర్, మల్లవ్వ, సుగుణ, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

'బండి'ని గెలిపించాలి



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని బొమ్మకల్‌లో శుక్రవారం బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. నల్ల చెరువులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు, ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులను కలిసి ఎంపీగా సంజయ్ చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఆయనను మరోసారి గెలిపించాలని కోరారు. అనంతరం అభివృద్ధి పనులకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దాది సుధాకర్, పాశం తిరుపతి, చిందం అశోక్, దాసరి రమణారెడ్డి, పుట్టపాక శ్రీధర్, పెద్ది లక్ష్మణ్, కాల్వ రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

సంజయ్‌కి పలు బీసీ సంఘాల మద్దతు



కరీంనగర్: బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కి శుక్రవారం పలు బీసీ సంఘాలు మద్దతు తెలిపాయి. నాయకులు మాట్లాడుతూ.. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలందరూ ఏకమై, బీసీ అభ్యర్థి అయిన సంజయ్‌ని గెలిపించాలని కోరారు. ప్రధాన రాజకీయ పార్టీల్లో ఒక్క బీజేపీ మాత్రమే బీసీ అభ్యర్థికి అవకాశం ఇచ్చిందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని, ఆయనను గెలిపించాలని పిలుపునిచ్చారు. నాయకులు కేశిపెద్ది శ్రీధర్ రాజు, ఎన్నం ప్రకాశ్, నాగుల కనకయ్య గౌడ్, నారోజు రాకేశ్‌చారి, దొగ్గలి శ్రీధర్, మియాపురం రవీంద్రాచారి, కాయితోజు బ్రహ్మచారి, రంగు సంపత్ గౌడ్, మాదాసు సంజీవ్, బోయిని ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీమద్రామాయణ మహా క్రతువు



కరీంనగర్‌కల్చరల్: విద్యానగర్ బీవీఆర్ ఫంక్షన్ హాల్లో ఉత్సవ నిర్వహణ సమితి, యతిరాజ సేవా మండలి, వికాస తరంగిణి ఆధ్వర్యంలో శనివారం నుంచి ఈ నెల 14 వరకు శ్రీమద్రామాయణ మహా క్రతువు నిర్వహిస్తున్నట్లు పండితుడు తూపురాణి శ్రీరమణీరంగాచార్యస్వామి తెలిపారు. శుక్రవారం క్రతువు స్థలంలో సంబంధిత కరపత్రాలను నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. చివరి రోజు ఉదయం 8 గంటల నుంచి యుద్ధకాండలోని విశేష సర్గల పారాయణాలు, శ్రీరామ మూలమంత్ర హవనం, సీతారామచంద్రస్వామి మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం, నవకలశ స్థాపన, రాజలాంఛనాల సమర్పణ, మధ్యాహ్నం మంగళ శాసనం, ఋత్విక్ సన్మానం, మహదాశీర్వచనం, అన్నదానం ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బల్మూరి ప్రభాకర్‌రావు, కరుణాకర్ రావు, లక్ష్మీగిరిధర్‌రావు, లావణ్య శ్రీపతిరావు తదితరులున్నారు.

తమ్ముడూ.. బీజేపీ నీకేం తక్కువ చేసింది?

• మంత్రి 'పొన్నం' ట్రాప్‌లో పడొద్దు
• బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి ఆయన సోదరి జయశ్రీ హితవు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ

కరీంనగర్‌టౌన్: తమ్ముడూ శ్రీరామ్.. బీజేపీ నీకేం తక్కువ చేసింది.. కష్టకాలంలో అక్కున చేర్చుకుంది.. ఎంపీ బండి సంజయ్ ఎన్నో ఇబ్బందులను అధిగమించి, నీకు టిక్కెట్ ఇప్పిస్తే కాంగ్రెస్‌లోకి వెళ్లాలనుకోవడం న్యాయమా? సంజయ్ బంపర్ మెజార్టీతో గెలుస్తారని సర్వేలు తేల్చడంతో ఆయనను ఓడించడానికి మంత్రి పొన్నం ప్రభాకర్ నిన్ను పావుగా వాడుకోవాలని చూస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మ జయశ్రీ అన్నారు. నాన్న వెంకన్న హుస్నాబాద్‌లో ఎర్రజెండాను ఓడించి, కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తే.. కుట్ర చేసి, ఆయనను వేములవాడ పంపించి, ఓడించిన మోసగాడు పొన్నం ప్రభాకర్ అని ఆరోపించారు. ఆయన ట్రాప్‌లో పడొద్దని తన తమ్ముడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి హితవు పలికారు. శుక్రవారం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నేత ఇనుగాల పెద్దిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. దేశమంతా ప్రధాని మోదీ గాలి వీస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎంపీ సంజయ్‌ని ఓడించడానికి కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఇందులో భాగంగానే హుస్నాబాద్ బీజేపీ నేత బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి కాంగ్రెస్ గాలం వేస్తోందన్నారు. కరీంనగర్‌లో డిపాజిట్ రాదని తెలిసిన పొన్నం వడ్డించిన విస్తరిలా ఉన్న హుస్నాబాద్‌కు పారిపోయి, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిని మోసం చేశారని పేర్కొన్నారు. నాయకులు కన్న కృష్ణ, రాపర్తి విజయ, కొలగాని శ్రీనివాస్, బొంతల కల్యాణ్‌చంద్ర, కటకం లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

'కిమ్స్'లో విద్యార్థులకు వీడ్కోలు





జ్యోతిప్రజ్వలన చేస్తున్న చైర్మన్ రవీందర్‌రావు, నృత్యం చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్: మనిషి సాధించలేనిది ఏదీ ఉండదని, లక్ష్యాన్ని నిర్దేశించుకొని ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తే ఫలితం ఉంటుందని కిమ్స్ విద్యాసంస్థల చైర్మన్ పేర్యాల రవీందర్‌రావు అన్నారు. రేకుర్తిలోని కిమ్స్ మేనేజ్‌మెంట్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం కార్నివాల్–24 పేరిట వీడ్కోలు వేడుక నిర్వహించారు. మేనేజ్‌మెంట్ రంగంలో ఉన్నత అవకాశాలను చేజిక్కించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు, ప్రిన్సిపాల్ కృష్ణమోహన్‌రావు, లెక్చరర్లు సందీప్, సుమలత, కల్యాణ్, అనిల్, సంతోషిణి తదితరులున్నారు.

తడి ఆరకుండా.. ఓల్టేజీ పెరగకుండా..

వేసవి నేపథ్యంలో ఎండల తీవ్రతకు ఓల్టేజీ పెరగకుండా, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఎన్పీడీసీఎల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఎండవేడికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్త్ పైపులు, వైర్ల వద్ద తేమశాతం తగ్గిపోతోంది. దీంతో గ్రామాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు సబ్‌స్టేషన్లలోని పీటీఆర్, డీటీఆర్‌ల ఎర్త్ పైపుల వద్ద ట్యాంకర్లతోపాటు అందుబాటులో ఉన్న నల్లా పైపులతో సిబ్బంది ప్రతీరోజు నీటిని పడుతున్నారు. ఎండలు తగ్గే వరకు నీళ్లు పడుతామని తెలిపారు.

– కరీంనగర్‌రూరల్



– ఎర్త్ పైపు వద్ద నీరు పడుతున్న సిబ్బంది

ప్రజ్ఞ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరానికి హాజరైన విద్యార్థులు

కరీంనగర్‌కల్చరల్: వికాస తరంగిణి, జెట్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న ప్రజ్ఞ వేసవి శిక్షణ శిబిరాన్ని సప్తగిరికాలనీ కోదండ రామాలయంలో దుర్వేద్ గాంధీ పేపర్‌మార్ట్ అధినేత జోగినపల్లి రఘునందన్‌రావు శుక్రవారం ప్రారంభించారు. చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలిరోజు 52 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు ప్రతీరోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణనిస్తామని వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు కె.గౌతమరావు పేర్కొన్నారు. 8 నుంచి 16 ఏళ్ల మధ్య వయసున్న బాలబాలికలు అర్హులని, శిక్షణలో శ్లోకాలు, కీర్తనలు, భజనలు, నైతిక కథలు, యోగా, ధ్యానం, పండుగల విశిష్టత, రామాయణ, భాగవతంలోని కొన్ని అంశాలు, ఋషుల చరిత్ర, ఆటలు నేర్పిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆలయంలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఇంటి వద్దనే ఓటు



చేగుర్తిలో ఓటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న ఎన్నికల సిబ్బంది

కరీంనగర్‌రూరల్: నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు, 85 ఏళ్లు పైబడిన వృద్ధులకు పార్లమెంట్ ఎన్నికల్లో ఇంటివద్దనే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. కరీంనగర్ నియోజకవర్గంలో ఇలాంటి ఓటర్లు మొత్తం 123 మంది ఉన్నారు. ఈ నెల 13న పోలింగ్ ఉండటంతో వారు శుక్రవారం నుంచి ఈ నెల 6వ తేదీ వరకు ఇంటి వద్దనే ఓటువేసేలా చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం నిర్వహించిన పోలింగ్‌లో 31 మంది దివ్యాంగులు, 41 మంది వృద్ధులు ఓటుహక్కు వినియోగించుకున్నారు.